క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : చెన్నూరులో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అలాగే గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్టిఫికెట్లు పొందే లబ్ధిదారులు పాల్గొనాలని వారు కోరారు.

మట్కా బీటరు అరెస్టు

ముద్దనూరు : స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో మంగళవారం రమణ అనే మట్కా బీటరును అరెస్టుచేసి అతని వద్దనుంచి రూ.3వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌బాబు, ఎస్ఈబీ సీఐ చెన్నారెడ్డిలు తెలిపారు.

ఉత్తమ పౌరులుగా తయారు కావాలి

జమ్మలమడుగు : ప్రతి విద్యార్థి ఉత్తమపౌరులుగా తయారుకావడంతోపాటు బాగా చదువుకుని కాలేజీకి, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకుని రావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మంగళవారం జూనియర్ కళాశాలలో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులకు గండికోట చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక లక్ష్య నిర్దేశించుకుని అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

చింతకొమ్మదిన్నె : ప్రస్తుత పరిస్థితులలో ఉపాధ్యాయులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని మండల విద్యాధికారి వెంకట్రామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పి బోర్డుస్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇవ్వడం ద్వారా వారి విద్య మెరుగు పడుతుందన్నారు. పాఠ్యాంశాలను అర్థమయ్యే విధంగా చెప్పడం, పాఠశాల అభివృద్ధి చేయడం వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిద్య ఫలితాలు సకాలంలో విడుదల చేయాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయవిద్యను చదువుతున్న విద్యార్థుల సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేయాలని బసవతారకం న్యాయకళాశాల కరస్పాండెంట్ ఎస్. గోవర్ధన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన వైవీయూలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమిస్టర్ పరీక్షల మూల్యాంకనం చేయడానికి న్యాయ కళాశాలల ఫ్యాకల్టీకి అవకాశం ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ ప్రాసెసింగ్‌లో సాంకేతిక సమస్యలను సరిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్, సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ తదితర వాటిలో గ్రామీణ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువకులు ఇందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబరులో సంప్రదించాలన్నారు.

వాహనాల తనిఖీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు మంగళవారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై జరిమానాలు విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హెచ్చరించారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులలో వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ సమస్యను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఈఓ పూల్‌లో ఉన్న ఎల్‌పిలకు కూడా జీతాలు ఆలస్యం అవుతున్నాయన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలుగా మారిన పాఠశాలలకు డీడీఓ కోడ్ లేని కారణంగా వారి జీతాలు ఆలస్యమవుతున్నాయన్నారు. సంబంధిత సమస్యలను పరిష్కరించి సకాలంలో జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు డీఈఓను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు క ఇరణకుమార్, జావిద్, సిద్దయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి


జమ్మలమడుగు : సర్టిఫికేట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : జగనన్న సురక్షతో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో సర్పంచ్ గురుదేవి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. జగనన్నసురక్షలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు కచ్చితంగా పరిష్కారం లభించేవిధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు సేవలు అందుతున్నాయన్నారు. మంచి చేసిన వారిని ప్రజలు ఆదరించాలన్నారు. నాడు నాయకులు ఇళ్ల వద్దకు వచ్చిన దాఖలాలు ఎక్కడాలేవన్నారు. కార్యక్రమంలో మాజీ టీబీహెచ్ఎల్‌సీ చైర్మన్ ఉప్పలపాడు శ్రీనివాసులరెడ్డి, గురప్ప, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఉచితంగా సర్టిఫికెట్ల పంపిణీ

తొండూరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా సర్టిఫికెట్లు అందిస్తున్నామని మండల రైతు సంఘం నాయకుడు వెంకట్రామిరెడ్డి, గృహ సారథుల కన్వీనర్ రజినికాంత్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు అర్హులైన వారికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాల నరసింహులు మాట్లాడుతూ అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ కార్యాలయానికి వచ్చి తెలియజేస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విష్ణుప్రసాద్, సర్పంచ్ రాజేశ్వరి, ఎంపీటీసీ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సాయి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.


తొండూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు

పులివెందులలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు


సీసీ కెమెరాలను అమర్చేందుకు రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అర్బన్ సీఐ రాజు, తదితరులు

పులివెందుల : పట్టణంలో మూడవ నేత్ర నిఘా (సీసీ కెమెరాల) అమర్చుటలో భాగంగా రూట్ మ్యాప్‌ను మంగళవారం అర్బన్ సీఐ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని సర్కిల్స్, జంక్షన్లు, ప్రధాన రోడ్లు, మసీదు, చర్చి, దేవాలయాలు, పాఠశాలలు, జన సాంద్రత గల అన్ని ప్రాంతాలలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో పాడా నిధుల కింద 300 సీసీ కెమెరాలు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పట్టణంలోని పలు ప్రాంతాలను సీఐ రూట్ మ్యాప్ ద్వారా పరిశీలించి మాట్లాడారు. సీసీ కెమెరాలు దొంగతనాలు, స్నాచింగ్, ఇతర నేరాల నేరస్తులను కనిపెట్టుటలో ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణతో కేసు దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసేందుకు, దర్యాప్తును మరింత పటిష్టపరిచేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐ స్వామి, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం


లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం వార్డు సచివాలయంలో కౌన్సిలర్ విజయ్‌కుమార్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎర్రగుడిపల్లె, వెంకటాపురంలలో సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.9 కోట్లు మంజూరైందని.. త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, సచివాలయ సిబ్బంది పనితీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 944 మంది లబ్ధిదారులకు పలు కుల, ఆదాయ, వివాహ, జనన తదితర 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు డేనియల్ బాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు


విద్యార్థులకు పుస్తక సామగ్రిని పంపిణీ చేస్తున్న మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీలు

వేముల : ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చునని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డిలు తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తక సామగ్రిని విద్యార్థులకు వారు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్న ఉద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా దీవెన, జగనన్న గోరు ముద్ద తదితర పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, గంగులయ్య, మాజీ ఎంపీటీసీ మల్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లింగాల : ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ సుభాషిణి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె డెంగీ నివారణా మాసోత్సవం, ప్రపంచ జనాభా దినోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయని.. నీరు నిల్వలు ఉండటంవలన దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని.. కాబట్టి జాగ్రత్తలు పాటించాలని, దోమ కాటు వలన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు వ్యాధి, ఫైలేరియాసిస్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య, సీహెచ్ఓ శివరాం, డీపీఎంఓ రమణారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అవగాహన


పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా పట్టణంలోని పాఠశాలల కరస్పాండెంట్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్‌లు హాజరై పారిశుధ్య నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, మున్సిపల్ సిబ్బంది, నోడల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టండి


మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

గోపవరం : వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టిపెట్టాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహా మండలి చైర్మన్ పుత్తాశివప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం బద్వేలు ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సిద్ధవటం, అట్లూరు, గోపవరం, బద్వేలు మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు, ఏఓ అరవింద నాయక్, సిబ్బంది సలహా మండలి చైర్మన్ శివప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

నేడు జగనన్న సురక్ష

కమలాపురం : నగర పంచాయతీ పరిధిలోని 2వ సచివాలయం, సంబటూరులలో బుధవారం జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంనకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఎంపీడీఓ చలపతి వేరు వేరు ప్రకటనల్లో తెలిపారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : వీరపునాయునిపల్లె, అలిదెన సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు వీరపునాయునిపల్లె, 1 గంటకు అలిదెన గ్రామంలో జరుగుతుందని ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

లేబాకలో

వల్లూరు : మండల పరిధిలోని లేబాక గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందచేయడం జరుగుతుందని,

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు దరఖాస్తు చేసుకోండి

వల్లూరు : ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో నూతన పరిశ్రమల స్థాపనకు లేదా వున్న పరిశ్రమల అభివృద్ధికి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్‌పీ మధు తెలిపారు. ఈ పథకం కింద ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతం రుణ సౌకర్యం వుంటుందన్నారు. 35 శాతం సబ్సిడీ ఉంటుందని తెలిపారు. రెండు రోజుల పాటు వల్లూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అందుబాటులో వుంటామని, ఆసక్తి వున్న వారు తమ దరఖాస్తులను అందించవచ్చునని డీఆర్‌పీ తెలిపారు.

రెండో రోజుకు అంగన్‌వాడీల ధర్నా

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు వద్ద రెండో రోజు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ అర్బన్ ప్రాజెక్టులో అంగన్‌వాడీ కేంద్రాల విలీన విధానం సక్రమంగా లేదన్నారు. దీని వల్ల కొంత మందికి మేలు, మరికొంత మందికి నష్టం జరుగుతోందని చెప్పారు.

ఉద్యోగుల సేవలో ఎంపాయీస్ యూనియన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగుల సేవలో ఎంప్లాయిస్ యూనియన్ కొనసాగుతున్నదని జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కేకే కుమార్, రాజశేఖర్‌లు తెలిపారు. మంగళవారం జోనల్ కార్యాలయం వద్ద 72వ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ, మెడికల్ సౌకర్యాలను కల్పించిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్ దేనన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధికి కృషిచేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి

వల్లూరు : అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి సమష్టిగా పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేద్దామని మాజీ జడ్పీటీసీ సభ్యులు అబ్బిరెడ్డి వీరారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో వైఎస్ ఎంపీపీ గంగయ్య అధ్యక్షతన మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లను అందించడమే కాక అర్హత కలిగి పథకాలు అందని వారికి న్యాయం చేయడానికి అవకాశం ఉందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మరింత మేలు చేకూర్చడానికి అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. లేబాక ఎస్సీ కాలనీలో ఎంపీపీ పాఠశాల ఆవరణ నుంచి వెళుతున్న విద్యుత్ లైన్లను మార్చడానికి విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ జుబేద మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ శంకర్‌రావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో సర్టిఫికెట్ల మంజూరులో జిల్లాలో మన మండలం ప్రథమ స్థానంలో వుందన్నారు. అనంతరం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి సంభందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ రామకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, సర్పంచ్‌లు శ్రీనివాసులురెడ్డి, పెద్దక్క, రాజయ్య, ఏఓ సాయిజ్యోతి, ఎంఈఓ లిల్లెమ్మ, ఈఓపీఆర్‌డీ ప్రసాద్, ఏపీఎం శైలజ, వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి, ఏఈలు పవన్, డానియేల్ జోసెఫ్, ఏపీఓ పార్థసారథి, పశు వైద్యాధికారి మారుతీ ప్రతాప్, ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్‌పీ మధు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై థర్డ్ పార్టీ విచారణ


వెలుగు కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ సత్యానందం

వల్లూరు : వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథం (వెలుగు) కార్యాలయంలో జరిగిన నిధుల దుర్వినియోగానికి సంబంధించి మంగళవారం థర్డ్ పార్టీ విచారణ ప్రారంభమైంది. కార్యాలయంలో సీఐఎఫ్, స్త్రీ నిధి, ఉన్నతి, ఇసుక రీచ్ కమీషన్ల నిధులకు సంబంధించి మొత్తం రూ.53.79 లక్షల మేర నిధుల దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెలుగు చూసిన నేపథ్యంలో కలెక్టర్ థర్డ్ పార్టీ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ సత్యానందం ఆధ్వర్యంలో మంగళవారం వల్లూరులోని వెలుగు కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయా విభాగాల లావాదేవీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది, సంబంధిత గ్రామ సమాఖ్యల వీఓఏలతో పలు అంశాలను గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ సత్యానందం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. నిధుల దుర్వినియోగం జరిగిన 7 గ్రామ సమాఖ్యల రికార్డులను సమగ్రంగా పరిశీలించి పూర్తిస్థాయి నివేదికలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహకార శాఖ సీనియర్ అసిస్టెంట్ మురళీ, ఏపీఎం శైలజ, వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేంద్రనాథ్

లింగాల : ఉపాధి పనులలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ సురేంద్రనాథ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఉపాధి హామీ సిబ్బందికి ఆయన అత్యవసర సమావేశం నిర్వహించి మాట్లాడారు. జాబ్ కార్డులు ఉన్న వారితో ఉపాధి పనులు చేయించాలన్నారు. పనులకు వెళ్లకపోయినా హాజరు వేసి మస్టర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవకతవకలకు పాల్పడిన వారికి జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సుబ్బారెడ్డి, ఏపీఓ లావణ్య, ఉపాధి హామీ ఇంజనీర్ గంగరాజు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై దృష్టి సారించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది


చెన్నూరులో పర్యావరణంపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

వేంపల్లె : దేశంలో జనాభా నియంత్రణపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తాళ్లపల్లె పీహెచ్‌సీ డాక్టర్ స్వాతిసాయి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాళ్లపల్లె పీహెచ్‌సీ డాక్టర్ హాజరై విద్యార్థినులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా ఎక్కువైయేకొద్దీ తినడానికి ఆహారం కొరత ఏర్పడుతుందన్నారు. అలాగే రోగాలు కూడా ఎక్కువ అవుతాయన్నారు. జనాభా పెరగడానికి ముఖ్య కారణంగా బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు అన్నారు. అనంతరం ఒకరు ముద్దు.. ఇద్దరు వద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నీషా, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం హబీబుల్లా, హేమమాలిని, పీఈటీ భారతి, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అధిక జనాభాతో పర్యావరణానికి ముప్పు

చెన్నూరు : అధిక జనాభా వల్ల పేదరికమే కాకుండా, పర్యావరణానికి కూడా ముప్పు వాటిల్లుతుందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.చెన్నారెడ్డి తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పురవీధులలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశాలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీదేవి, హెల్త్ సూపర్ వైజర్లు సుబ్రహ్మణ్యం, లక్ష్మీ కుమారి, వైద్య సిబ్బంది, గీతాంజలి ఫాతిమా జేడీ కళాశాల నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక జనాభాతో అనర్థాలే ఎక్కువ

తొండూరు : దేశ పురోగతికి జనాభా అవరోధమని.. అధిక జనాభావల్ల అనర్థాలు కూడా ఎక్కువేనని పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా తెలిపారు. మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఆయన డ్వాక్రా మహిళలు, గర్భిణులు, విద్యార్థులకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధిక జనాభావల్ల పేదరికం, వనరుల కొరత ఏర్పడటంతోపాటు నాణ్యమైన విద్య, వైద్యం, నిరుద్యోగ సమస్య, జీవన ప్రమాణాలు దెబ్బతింటాయన్నారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించడంవల్ల బిడ్డకు, బిడ్డకు మధ్య ఎడం కలుగుతుందని.. దీనివల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. తద్వారా మాత, శిశు మరణాలను తగ్గించవచ్చునన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, వైద్య, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉచిత పంటల బీమా

- నియోజకవర్గ వ్యాప్తంగా రూ.84.64 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

వేముల : ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఉచిత పంటల బీమా రైతులకు అండగా నిలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలు చేస్తున్నారు. పంటల బీమాలో రైతుపై రూపాయి కూడా భారం పడకుండా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తోంది. ఆయా సీజన్లలో సాగైన పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా అమలవుతోంది. సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ ప్రామాణికంగా పంటల బీమాను అమలు చేస్తోంది. దీని ద్వారా రైతులు ఏ పంటలు సాగు చేశారో ఆ పంటలకు ఉచిత పంటల బీమా అమలు చేస్తున్నారు. అయితే సాగులో ఉన్న పంటలు ప్రకృతి వైపరీత్యాలు, చీడపీడలు, తెగుళ్లు సోకి దెబ్బతిని దిగుబడులు రాకపోతే బీమా వర్తిస్తుంది.

నియోజకవర్గ వ్యాప్తంగా రూ.84.64 కోట్లు మంజూరు

ఈ ఏడాది పులివెందుల నియోజకవర్గానికి రూ.84.64 కోట్ల పంటల బీమా మంజూరైంది. నియోజకవర్గ వ్యాప్తంగా 30,860 మంది రైతులకు 81,767 ఎకరాలకు బీమా వర్తిస్తోంది. వర్షాధార పత్తికి ఎకరాకు రూ.8,883లు, నీటిపారుదల కింద పత్తికి ఎకరాకు రూ.14,667లు, ఉల్లికి ఎకరాకు రూ.10,180, చీనీకి రూ.9,600, కంది పంటకు రూ.822ల చొప్పున బీమా మంజూరైందని తెలిపారు. గత ఏడాది రైతులు సాగు చేసిన పత్తి, నీటి పారుదల పత్తి, చీనీ సాగు, వేరుశనగ, ఉల్లి, కంది పంటలకు బీమా మంజూరైంది.

పంటల బీమా మంజూరు వివరాలు

మండలం	రైతులు	విస్తీర్ణం ఎకరాలలో	మంజూరైన బీమా రూ. కోట్లలో
పులివెందుల	2319	6662	7.38
వేముల	6345	17956	16.70
వేంపల్లె	3735	11240	13.59
సింహాద్రిపురం	5301	17956	17.87
తొండూరు	7363	12855	17.14
చక్రాయపేట	1935	3278	1.64
లింగాల	3862	11820	10.32

పంటల బీమా మంజూరుతో రైతులలో హర్షం



గత ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు బీమా మంజూరుతో రైతులలో హర్షం వ్యక్తమవుతోంది. బీమా విషయమై కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో బీమా మంజూరైంది. ఈనెల 8వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి బీమా మొత్తాన్ని రైతుల ఖాతాలలో జమ చేశారు. దీంతో నియోజకవర్గంలోని రైతులందరికీ బీమా మంజూరైంది.

– నాగేళ్ల సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి, వేముల